క్లుప్తంగా

అక్టోబర్ 1న టెన్నిస్ పోటీలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని టెన్నిస్ కోర్టు ఆవరణలో అండర్–14, అండర్–17 బాల బాలికలకు అక్టోబర్ 1వ తేదీన టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుర్రం శోభన్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు అడ్మిషన్ నెంబర్, పెన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలతో కూడిన పత్రంపై ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించుకుని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

సీపీఎం నేత సూరా అంకిరెడ్డికి ఘన నివాళి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు సూరా అంకిరెడ్డి 4వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం పార్టీ విస్తరణకు అంకిరెడ్డి ఎనలేని కృషి చేశాడని వక్తలు కొనియాడారు. పార్టీ నేత టి.ఆవులయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మూర్తి, డి.థామస్, అల్లూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి బదిలీ

గిద్దలూరు రూరల్: స్థానిక ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి కంభం పట్టణానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి జిల్లా వాకాడులో ఎస్సైగా పనిచేస్తున్న ఎం.జయరావును పదోన్నతిపై సీఐగా నియమించారు. రెండు లేదా మూడు రోజుల్లో జయరావు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


చెట్ల పాదులు తొలగిస్తున్న తహసీల్దార్

కొనకనమిట్ల: స్వచ్ఛత ఆరోగ్యానికి దోహదం చేస్తుందని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ ఆవుల సురేష్ పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణను సిబ్బంది, వీఆర్‌ఓలతో కలిసి బాగుచేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటేందుకు కృషి చేస్తామని చెప్పారు. వీఆర్‌ఓలు దిలీప్, జానయ్య, నాగరాజు, శ్రీకాంత్, సంతోష్, కుమార్ పాల్గొన్నారు.

‘కిట్స్’లో డెవోప్స్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, సిబ్బంది

మార్కాపురం టౌన్: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్‌పై తృతీయ సంవత్సరం విద్యార్థులకు వారంరోజులపాటు డెవోప్స్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెన్న కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందేందుకు అవసరమైన నైపుణ్యాన్ని విద్యార్థులకు నేర్పించనున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్లుగా పి.గగన్‌కుమార్, సీహెచ్ తేజ, రామకుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ హెచ్‌ఓడీ జేవీ అనీల్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలి


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

బేస్తవారిపేట: అర్ధవీడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అక్టోబర్ 1వ తేదీన నిర్వహించనున్న మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని జేవీవీ మండల అధ్యక్షుడు ఎం.తిరుపతిరెడ్డి, ఎ.మల్లికార్జునరావు కోరారు. ఆదివారం గురుకుల పాఠశాల ఆవరణలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులు 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా మండల స్థాయి పోటీలకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పంపాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఎం.కేశిరెడ్డి, డి.నర్సయ్య, పి.రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఎస్.బాబురావు పాల్గొన్నారు.

పంట పోయింది.. పరిహారం రానంటోంది!


ఇటీవల వర్షాలకు తడిసిన నువ్వుల ఉడ్లు


నేలకొరిన సజ్జ పంట

- ఇటీవల వర్షాలకు రాచర్ల మండలంలో నువ్వు, సజ్జ పంటలకు తీవ్ర నష్టం
- తగ్గిన పంట దిగుబడి.. గిట్టుబాటు ధరపైనా ప్రభావం
- రూ.15 వేల నుంచి రూ.8 వేలకు దిగజారిన నువ్వుల ధర
- క్వింటా రూ.2,600 కూడా పలకని సజ్జలు
- పెట్టుబడి కూడా చేతికి రాదని రైతుల ఆవేదన
- పరిహారం, గిట్టుబాటు ధరపై రైతుల్లో నన్నగిల్లిన ఆశలు

రాచర్ల:

పంట దిగుబడిపై రైతుల ఆశలను వర్షాలు సగం దెబ్బతీయగా.. మిగిలిన సగాన్ని ప్రభుత్వం దెబ్బతీసింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కోత దశలో ఉన్న నువ్వులు, సజ్జ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట దిగుబడి తగ్గిపోయి, ధర కూడా పడిపోవడంతో పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాచర్ల మండలంలోని 907 ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేశారు. అనుమలవీడు, గౌతవరం, సోమిదేవిపల్లె, గుడిమెట్ట, యడవల్లి, సత్యవోలు, అనుములపల్లె గంగంపల్లె, కాలువపల్లె గ్రామాల్లో అత్యధికంగా నువ్వుల పంట సాగైంది. జూలై నెలలో పంట సాగు చేయగా విత్తనం మొలకెత్తిననప్పటి నుంచి పూత దశకు వచ్చే వరకు వర్షాలు లేకపోవడంతో పూత మొత్తం రాలిపోయింది. అక్కడక్కడా పండిన నువ్వు పంటను రైతులు కోత కోసి పొలాల్లో ఉడ్లు వేశారు. సరిగ్గా అదే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలతో నువ్వు ఉడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని యడవల్లి, సత్యవోలు, అనుమలవీడు, గుడిమెట్ట, ఒద్దులవాగుపల్లె, రంగారెడ్డిపల్లె గ్రామాల్లో 308 ఎకరాల్లో సజ్జ పంట సాగు చేయగా వర్షాలతో పంట నేలకొరిగింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా సత్యవోలు, యడవల్లి గ్రామాల్లో సజ్జ పంట పూర్తిగా దెబ్బతింది. సజ్జ కంకులు వర్షపు నీటితో నానడంతో మొలకెత్తాయి.

పడిపోయిన ధరలు

నువ్వు పంట సాగు చేసే సమయంలో క్వింటా ధర రూ.15 వేలు ఉండగా పంట చేతికొచ్చే సరికి క్వింటా ధర రూ.9 వేలకు పడిపోయింది. నువ్వులు తడిచిపోయాయనే కారణాన్ని బూచిగా చూపి కొందరు వ్యాపారులు క్వింటా రూ.7 వేలు లేదా రూ.8 వేలకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు దగా పడుతున్నారు. సజ్జల ధర కూడా క్వింటా రూ.2,600కు పడిపోయింది. నువ్వు, సజ్జ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


మొలకలు వచ్చిన సజ్జ కంకులు

సజ్జ కంకులు మొలకలొచ్చాయి



నేను రెండు ఎకరాల్లో సజ్జ పంట సాగు చేశా. పంట ఏపుగా పెరగడమే కాకుండా కాపు కూడా బాగ వచ్చింది. అయితే ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో పంట పూర్తిగా నేలకొరిగింది. కంకులు నీటిలో తడిచి మొలకలు వచ్చాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– వడ్డే వీరారెడ్డి, సత్యవోలు

నువ్వుల పంట నష్టపోయా



నేను ఒకటిన్నర ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేశా. పంట సాగు చేసిన సమయంలో వర్షాలు లేకపోవడం, కోత సమయంలో అధిక వర్షాల కారణంగా నువ్వుల దిగుబడి తగ్గిపోయింది. 1.5 ఎకరాల్లో పంట సాగు చేస్తే కేవలం క్వింటా మాత్రమే దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో నాతోపాటు మిగిలిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని కోరుతున్నాం.

– షేక్.పల్నాటి మహబూబ్ పీరా, అనుమలవీడు


ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు, నాయకులు

టెట్ అభ్యర్థులకు మోడల్ పరీక్ష

మార్కాపురం టౌన్: ఏపీ టెట్ మోడల్ పరీక్షను యూటీఎఫ్, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు రాందాస్‌నాయక్, శ్రీనివాసులు పాల్గొని ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, యూటీఎఫ్ నాయకులు శ్రీరాములు, ప్రభాకర్, నాగేశ్వరరావు, ఎస్‌కె రసూల్, డీవైఎఫ్‌ఐ నాయకులు కొండయ్య, జబ్బార్, నాయకులు పాపయ్య, యలమందారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చలమారెడ్డి, నాసరయ్య, వెంకటరామిరెడ్డి, రాజేష్, వీరభద్రారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో టెట్ మోడల్ పరీక్ష

మార్కాపురం: ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో టెట్ మోడల్ పరీక్ష నిర్వహించినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు సుమారు 3 వేల మందికి పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు, జిల్లా సొసైటీ అధ్యక్షుడు ఎన్.ప్రసాదరావు, ఎస్టీయూ నాయకులు సీహెచ్ గాలెయ్య, రామకృష్ణారెడ్డి, మహేంద్ర, రంగస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ పరీక్షను పరిశీలిస్తున్న ఎస్టీయూ నాయకుడు ఎర్రయ్య

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ నాగరాజు హెచ్చరిక

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ, ఎస్సైలను డీఎస్పీ నాగరాజు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆయన పోలీస్ అధికారులతో కలిసి పాత బస్టాండ్, నాయుడు బజార్, చెన్నకేశవ స్వామి ఆలయం, తేరు బజార్, మెయిన్ బజార్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. పలువురు ద్విచక్ర వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపి షాపింగ్ చేయడాన్ని గమనించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోవాలాలు, షాపుల యజమానులకు కూడా వాహనాల పార్కింగ్‌పై కౌన్సెలింగ్ ఇవ్వాలని పోలీసులకు సూచించారు. మార్కాపురంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గల మార్గాలపై మరింత లోతుగా ఆలోచించాలని డీఎస్పీ స్పష్టం చేశారు. ఆయన వెంట సీఐ సుబ్బారావు, పట్టణ ఎస్సై సైదుబాబు సిబ్బంది ఉన్నారు.


ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు


భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పొదిలి: ఒంగోలు–నంద్యాల రోడ్డులో కాటూరివారి పాలెం సమీపంలో రోడ్డు పక్కనే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణదారునిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొదిలి రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో 22.81 ఎకరాల అసైన్ భూమి ఉంది. ఈ భూమిని ఓ కుటుంబం గత 20 సంవత్సరాలుగా అనుభవిస్తోంది. దీనిపై రెవెన్యూ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ శాఖకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కనిగిరి ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆక్రమణలను తొలగించారు. తహసీల్దార్ ఎంవీ.కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ కె.సుబ్బారావు, మండల సర్వేయర్, వీఆర్‌ఓలు ఉన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని అర్చకులు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామంలో పోలేరమ్మకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కుంకుమ బండ్లతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. సర్పంచ్ బట్టగిరి గౌతమి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, బట్టగిరి వెంకటరెడ్డి, జవ్వాజి లోకనాథరెడ్డి, అల్లారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, జవ్వాజి వెంకటరెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

గొట్లగట్టులో

కొనకనమిట్ల: మహాలయ పక్షాన్ని పురస్కరించుకొని మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామ దేవత పోలేరమ్మతల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. హరిజన కాలనీవాసులు కుంకుమ బండ్లతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి


భక్తులకు దర్శనమిస్తున్న అల్లూరి పోలేరమ్మ


గొట్లగట్టులో పొంగళ్లతో వెళ్తున్న భక్తులు


పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

విద్యార్థుల ఉన్నత భవితే ‘వివేకానంద’ లక్ష్యం


తల్లిదండ్రులను సత్కరిస్తున్న వైవీ, కేవీ

పొదిలి: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడమే లక్ష్యంగా శ్రీ వివేకానంద విద్యా సంస్థలు కృషి చేస్తున్నట్లు డైరెక్టర్లు వై.వెంకటేశ్వరరావు, కేవీ రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ, వైవీ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నతి కోసం యాజమాన్యం పాటుపడుతోందని, తల్లిదండ్రులు కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా మినీ వాటర్ ట్యాంకులు


పాలకవీడులో పాచితో నిండిపోయిన మినీ వాటర్ ట్యాంకు


అనుమలవీడులో పైపు పగిలిపోయిన వాటర్ ట్యాంకు


సచివాలయం సమీపంలో కుళాయి లేకపోవడంతో వృథాగా పోతున్న నీరు

- పాచితో నిండిపోయినా పట్టించుకోని అధికారులు

రాచర్ల: మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధిలోని అనుమలవీడు, పాలకవీడు గ్రామాల్లో మినీ వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో పాచితో నిండిపోయి దుర్వాసన వస్తున్నాయి. పాలకవీడు గ్రామంలో దర్గా వద్ద మినీ వాటర్ ట్యాంకు లోపలి భాగంతో పాటు బయట కూడా పాచి పట్టింది. అనుమలవీడు గ్రామంలోని శివాలయం సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైపులైను పగిలిపోయి నెలలు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అనుమలవీడు సచివాలయం సమీపంలోని వాటర్ ట్యాంకుకు కుళాయి అమర్చకపోవడంతో ట్యాంకులోని నీరంతా వృథాగా పోతోంది. ప్రస్తుతం సచివాలయం పంచాయతీ కార్యదర్శి రమణ దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోవడంతో యడవల్లి పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఆయన చుట్టం చూపుగా వచ్చి సచివాలయాన్ని సందర్శించి వెళ్లిపోతున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మినీ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, కుళాయిలు సక్రమంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాణసంచా స్వాధీనం


సీజ్ చేసిన క్రాకర్స్ చూపుతున్న ఎస్సై

మార్కాపురం: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో అక్రమంగా దీపావళి బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు టౌన్ ఎస్సై సైదుబాబు తెలిపారు. నిందితుడి నుంచి రూ.5 వేల విలువైన క్రాకర్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నాగముని కుమార్‌కు సత్కారం

దర్శి: ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ దర్శి యూనిట్ ట్రెజరర్ చల్లా నాగముని కుమార్‌ను ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. దర్శి ఖజానా కార్యాలయం నుంచి చీరాలకు బదిలీ అయిన సందర్భంగా దుశ్శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ బీఎస్ నాయుడు, కార్యదర్శి బీజేఎస్ హెరాల్డ్ తదితరులు పాల్గొన్నారు.